





కష్టజీవుల కడుపు కొట్టారు..!



మండుటెండలో బండలు కొడుతున్న కార్మికులు

బండ బతుకులు బద్దలు!



రాళ్లు, బండలు అడిగే నాథుడే లేడు

రాళ్లు, బండలు, కంకరకు ఏనాడూ రుసుము చెల్లించలేదు. వాటిని కర్ణాటకలోని చేలూరు, చింతామణి, బాగేపల్లి, అనంతపురం, తాడిపత్రి, కడప, చిత్తూరు జిల్లాల్లో విక్రయించే వారం. వ్యాపారులు కూడా ముందుగానే కార్మికులకు అడ్వాన్సుగా డబ్బు ఇచ్చి, పనులు చేయించుకునేవారు. ఏరోజుకారోజు కొట్టిన సరుకు అమ్ముడుపోయేది. వందలాది కుటుంబాలు రాళ్లు, కంకర, కూసాలు, బండలు తీసేవారు. వైసీపీ ప్రభుత్వం మైనింగ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో రుసుములు చెల్లించలేక వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వృత్తిని వదిలేసి, వలస వెళ్లాయి.

- సురేష్, కార్మికుడు, పరాకువాండ్లపల్లి

నిప్పులు కురిపించే సూరీడు..
మండిపోయే ఎండ..
మలమల మాడే బండ..
ఆ ఎండలోనే..
ఆ బండపైనే నిలబడి..
కాలిపోయే ఉలి చేతపట్టి..
సుత్తితో, సమ్మెటతో..
రెక్కలు విరగ్గొట్టుకుని..
బండలు ముక్కలు చేస్తాడు..
కార్మికుడు..
ఇంత బండ కష్టం చేసినా..
కడుపు నిండట్లేదు..
ఇల్లు గడవట్లేదు..
స్వేదం చిందించి..
పగులగొట్టిన రాళ్లకు..
తొలచిన బండలకు..
తీసిన కూసాలకు..
కప్పం కట్టమంటోంది..
వైసీపీ ప్రభుత్వం..
రుసుములు కట్టలేక..
రాళ్లు, బండలు కొనేవారు లేక..
కష్టజీవి రోడ్డునపడ్డాడు..
వృత్తి వదిలి.. వలసెళ్లి..
పరాయి పంచన పడ్డాడు..

రాళ్లు కొట్టినా పస్తులే..

- వైసీపీ పాలనలో చెక్‌పోస్టుల ఏర్పాటు
- నిర్వహణ ప్రైవేటుకు..
- రవాణాకు జంకుతున్న వ్యాపారులు
- ఉపాధి కోల్పోయిన కార్మికులు
- పస్తులుండలేక.. పరాయి ప్రాంతాలకు వలస

తనకల్లు, మార్చి 11: టీడీపీ పాలనలో కార్మికుల కోసం ప్రత్యేకంగా లేబర్ కాంట్రాక్టు సొసైటీలు ఏర్పాటు చేసి బండలు, రాళ్లు, కూసాలు, దిమ్మెలు, కంకరను కొట్టేవారికి సొసైటీల ద్వారా చేయూతనందించేవారు. వారికి కావలసిన గడ్డపార, పార, సుత్తి, సమ్మెట తదితరాలను సొసైటీల ద్వారా వారికి అందించేవారు. నిబంధనలు, రుసుములు లేకపోవడంలో కార్మికులు తాము కొట్టిన రాళ్లు, బండలు, కూసాలు, దిమ్మెలు తదితరాలను ఎక్కడికైనా తరలించి, అమ్ముకుని జీవనం సాగించేవారు. తనకల్లు మండలంలోని కొక్కంటి ప్రాంతంలో బండలకు విపరీతమైన గిరాకీ ఉండేది. వీటికోసం ఈప్రాంత రాజకీయ నాయకులు, ప్రత్యేకంగా కొక్కంటి నాయుళ్లు, మండలస్థాయి అధికారులు సిఫార్సు చేసేవారు. కర్ణాటక వాసులు, కొక్కంటి బండలు, రాళ్లను అధికంగా కొనుగోలు చేసేవారు. అనంతపురం, తాడిపత్రి, పులివెందుల, కడప జిల్లాలోని పలు పాంత్రాలకు వీటిని తరలించి, విక్రయించేవారు. బండలు, రాళ్లు కొట్టే పనిమీద 300 కుటుంబాలు జీవనం సాగించేవి. మండలంలోని పరాకువాండ్లపల్లి, కొక్కంటి, మల్లిరెడ్డిపల్లి కొత్తిండ్లు తదితర గ్రామాలకు చెందిన అనేక కుటుంబాలకు రాళ్లు కొట్టే పనే జీవనాధారం. చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి ముస్లింలు కూడా వచ్చి ఈప్రాంతంలో రాళ్లను కొట్టి, విక్రయించుకునేవారు. ఇలా ఈ ప్రాంతంలో వందల కుటుంబాలు జీవనం సాగిస్తుండేవి.

వైసీపీ అధికారం చేపట్టాక మునుపెన్నడూ లేనివిధంగా మండలానికి ఒక మైనింగ్ చెక్‌పోస్టును ఏర్పాటు చేసింది. వీటి నిర్వాహణ కూడా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. రాళ్లు, ఇసుక, బండలు, మట్టి తరలించాలంటే చెక్‌పోస్టుల్లో ట్యాక్స్ (రుసుం) చెల్లించాల్సిందే. దీంతో ప్రతి మండలంలో రుసుము చెల్లించుకుంటూ ఇతర ప్రాంతాలకు తరలించడం తలకు మించిన భారమైంది. ఈ నేపథ్యంలో రాళ్లు, బండల రవాణాకు వ్యాపారులు కూడా వెనకడుగు వేస్తున్నారు. దీంతో వందలాది కార్మిక కుటుంబాలు జీవనాధారం కోల్పోయాయి. రోడ్డున పడుతున్నాయి. దీంతో చేసేదిలేక కులవృత్తిని వదిలేసి, జీవనోపాధి కోసం బెంగళూరు, హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాలకు వలస వెళ్తున్నాయి. మండుటెండలో స్వేదాన్ని చిందించి, బండలు, రాళ్లు కొట్టినా, కూసాలు తీసినా అడిగే నాథుడే లేకపోవడంతో కార్మికులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఉదయమే బండమీదకెళ్లి రాళ్లు, బండలు, దిమ్మెలు కొట్టినా పస్తులు ఉండాల్సి వస్తోందని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఎందరో వ్యాపారులు కూడా రాళ్లు, బండల వ్యాపారాలు వదిలేసి, ఇతర వృత్తులు చేపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహించడం సంగతి దేవుడెరుగు, వారిపైకూడా పన్నులు విధించడంతో ఏమిచేయాలో తోచక దిక్కులు చూస్తున్నారు. తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కులవృత్తుల కార్మికులపై పన్నులు విధించకుండా, రుసుములు వసూలు చేయకుండా ఆ వర్గాలకు విక్రయించుకునే అవకాశం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నల్లచెరువు మండలంలోని చిన్నపల్లోలపల్లి వద్ద ఏర్పాటు చేసిన మైనింగ్ చెక్‌పోస్టు

మండుటెండలో బండలు పగలేసినా, పస్తులే

టీడీపీ పాలనలో లేబర్ సొసైటీల ద్వారా కార్మికులకు కావలసిన పనిముట్లను ఉచితంగా అందించేవారు. వైసీపీ పాలనలో అవి ఇవ్వకపోగా, మాపై కక్ష సాధిస్తున్నారు. మైనింగ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, ఇతర ప్రాంతాలకు బండలు, రాళ్లు, కంకర, కూసాలు, దిమ్మెలు తరలించడానికి వీలు లేకుండా చేశారు. చేసేదిలేక కార్మికులు ఇతర పనులకు వెళ్తున్నారు. వృత్తినే నమ్ముకున్న నాలాంటి వారు మండుటెండలో బండలు పగలేసి, రాళ్లు కొట్టినా పస్తులే ఉండాల్సి వస్తోంది. ప్రభుత్వం ఈ విషయంపై స్పందించి, కార్మికులకు న్యాయం చేకూరేలా చూడాలి.

- హరిప్రసాద్, కార్మికుడు, పరాకు వాండ్లపల్లి



అడ్వాన్సు ఇచ్చేవారు



గతంలో వ్యాపారులు.. కార్మికులకు అడ్వాన్సులు ఇచ్చి, బండలు, రాళ్లు, కంకర పనులు చేయించుకునేవారు. టీడీపీ పాలనలో ఉచితంగా పనిముట్లు ఇచ్చారు. ప్రస్తుతం పనిచేద్దామన్నా రోజు కూలికి పిలిచేవారే లేరు. సొంతంగా పనిచేద్దామంటే పనిముట్లు, పెట్టుబడి కావాలి. దీంతో ఎంతోమంది కార్మికులు ఈ పని మానేసి, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ప్రభుత్వం ఎందుకు మైనింగ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిందో అర్థం కావట్లేదు. వెంటనే వాటిని ఎత్తేయాలి. ఎక్కడైనా బండలు, రాళ్లు, కూసాలు అమ్ముకునే అవకాశం కల్పించాలి.

- వెంకటరమణ, కార్మికుడు, పరాకువాండ్ల పల్లి

రాష్ట్ర సరిహద్దులో కట్టుదిట్టమైన భద్రత: కలెక్టర్

పుట్టపర్తి, మార్చి 11: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో అక్రమ రవాణాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ నుంచి ఎస్పీ మాధవరెడ్డితో కలిసి కలెక్టర్.. కర్ణాటకలోని తుమకూరు, చిక్కబళ్లాపురం, చిత్రదుర్గ జిల్లాలకు చెందిన కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు సహకరించాలని కోరారు. కలెక్టర్ అరుణ్‌బాబు.. జిల్లా నైసర్గిక స్వరూపం, ఎన్నికల నిర్వహణ కేంద్రాల వివరాలు, సరిహద్దు ప్రాంతాలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. సరిహద్దు ద్వారా మద్యం, నగదు, మాదక ద్రవ్యాలు జిల్లాలోకి ప్రవేశించకుండా చేపట్టే చర్యలకు సహకరించాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోని చిలమత్తూరు, కొడికొండ, తూమకుంట, అగళి, బైడిగిర, రమగిరి, ఎగువపల్లి తదితర ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. లిక్కర్, కానుక వస్తువులు, డబ్బు, మారణాయుధాలు సరిహద్దులు దాటకుండా జిల్లా పోలీసులకు సహకరించాలన్నారు. ఎలాంటి అనుమానం ఉన్నా సరిహద్దులో ఉన్న జిల్లా పోలీసులకు వివరాలు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, సెబ్ ఏఎస్పీ నాగభూషణం, డీఎస్పీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

లేపాక్షిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



శివపార్వతుల శయనోత్సవం

లేపాక్షి, మార్చి 11: స్థానిక దుర్గావీరభద్ర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం దుర్గావీరభద్రస్వాములను ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకార్చనలు, వసంతోత్సవం, ధ్వజావరోహణం వైభవంగా నిర్వహించారు. నాట్యమండపంలో శివపార్వతులకు శయనోత్సవం చేశారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దేవదాయ శాఖ సిబ్బంది, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ముత్యాలపల్లకిలో ఊరేగిన ఆది దంపతులు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా లేపాక్షిలో ఆదివారం రాత్రి ముత్యాల పల్లకిలో ఆది దంపతులు ఊరేగారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ముత్యాలపల్లకిలో శివపార్వతులను అధిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవంలో కీలుగుర్రాల ప్రదర్శన నిర్వహించారు.

వైభవం.. హెంజేరు సిద్దేశ్వరుడి శిడిమానోత్సవం



శిడిమానోత్సవంలో పాల్గొన్న భక్తులు



అలంకరణలో హెంజేరు సిద్దేశ్వర స్వామి

మడకశిర టౌన్, మార్చి 11: అమరాపురం మండలంలో ప్రసిద్ధిగాంచిన హేమావతి హెంజేరు సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి శిడిమానోత్సవం వైభవంగా నిర్వహించారు. మొక్కుబడి ఉన్న భక్తులు వారం రోజులపాటు ఉపవాసదీక్షలు ఆచరించి, గంధం పూసుకుని పూలహారాలు వేసుకుని డప్పువాయిద్యాలు, మేళతాళాలతో శిడిమాను వద్దకు ఊరేగింపుగా చేరుకున్నారు. సాయంత్రం 5 గంటలకు శిడిమాను ఉత్సవంలో పాల్గొన్నారు. బెల్లం, జీలకర్రతో తయారుచేసిన తీపి పదార్థాన్ని శిడిమానుకు వేసి, మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉత్సవానికి జిల్లాతో పాటు కర్ణాటక నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు.

రంజాన్ వేళలు

	సెహరీ	ఇఫ్తార్
పుట్టపర్తి	5.07 (ఉదయం) బుధవారం	6.33 (సాయంత్రం) మంగళవారం
కదిరి	5.07 (ఉదయం) బుధవారం	6.33(సాయంత్రం) మంగళవారం
ధర్మవరం	5.11 (ఉదయం) బుధవారం	6.35(సాయంత్రం) మంగళవారం
హిందూపురం	5.15 (ఉదయం) బుధవారం	6.33(సాయంత్రం) మంగళవారం
పెనుకొండ	5.12 (ఉదయం) బుధవారం	6.31(సాయంత్రం) మంగళవారం

ఇంటర్ పరీక్షకు 204 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 11: జిల్లావ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షకు 204 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐఓ సురేశ్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 41 కేంద్రాల్లో ద్వితీయ సంవత్సరం గణిత-2బీ, జువాలజీ-2, హిస్టరీ -2 పరీక్షలు 6,873 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సిఉండగా.. 204 మంది గైర్హాజరయ్యారన్నారు. దీంతో 6,669 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని ఆర్ఐఓ వివరించారు.



అంగన్‌వాడీ కేంద్రంలో కూర్చున్న చిన్నారులు

పసివాళ్లకు పస్తులు!

అంగన్‌వాడీ కేంద్రంలో బువ్వ బంద్

- 11 రోజులుగా అందని పౌష్టికాహారం
- సరుకులు, రికార్డులు కార్యకర్త ఇంట్లో..
- కొరవడిన పర్యవేక్షణ

ఇంట్లో వాళ్లు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపుతారు. అక్కడే వారికి భోజనం వండిపెట్టి, పౌష్టికాహారం ఇస్తారని తెలుసు. దీంతో పిల్లల గురించి సాయంత్రందాకా పట్టించుకోరు. వారు తినేసి ఉంటారులే అనుకుంటారు. ఆకలేస్తోందని చెప్పడం, అన్నం పెట్టమని అడగడం కూడా ఆ పసివాళ్లకు తెలీదు. అలాంటి వాళ్లను అంగన్‌వాడీ కేంద్రంలో పస్తులు పెడుతున్నారు. ఒక రెండు కాదు.. ఏకంగా 11 రోజులుగా. పసివాళ్లు పగలంతా అంగన్‌వాడీ కేంద్రంలో కూర్చోవడం, పస్తులతో ఉండడం, ఖాళీ కడుపుతో సాయంత్రం ఇంటికెళ్లడం. హిందూపురం ప్రాజెక్టు పరిధిలోని పోచనపల్లి అంగన్‌వాడీ సెంటర్-2లో సాగుతున్న పస్తుల తంతు ఇది.

- హిందూపురం అర్బన్

ప్రభుత్వాలు ఐసీడీఎస్ ద్వారా చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నాయి. 6 ఏళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పాలు, గుడ్లు, బాలామృతం అందించాలి. పోచనపల్లి అంగన్‌వాడీ సెంటర్-2లో 11 రోజులలుగా పిల్లలు పస్తులుంటున్నారు. వంట కూడా వండకుండా చిన్నారులను కేంద్రానికి తీసుకొచ్చి కూర్చోబెట్టుకుని, మధ్యాహ్నం తరువాత ఉసూరుమంటూ ఇంటికి పంపిస్తున్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా పిల్లలు కేంద్రానికి వచ్చి పస్తులతో ఇంటికి వెళ్తున్నారు. ఇంత జరుగుతున్నా సీడీపీఓ అటుగా కన్నెత్తి చూడకపోవడం శోచనీయం. అంగన్‌వాడీ కేంద్రంలో కనీసం గర్భవతులు, బాలింతలకు సంబంధించిన రికార్డులు కూడా లేవు. కార్యకర్త ఇంట్లో ఉంచుకున్నారు. అటెండెన్స్‌లో పిల్లలు హాజరైనట్లు చూపారు. వారికి పౌష్టికాహారం మాత్రం ఇవ్వలేదు. అడిగితే స్టాకు రాలేదని చెబుతున్నారు. స్టాకు రాకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పక్క సెంటర్ నుంచి తెచ్చుకుని, పిల్లలకు అందించాల్సి ఉంది. కనీసం ఆ విషయమైనా ఉన్నతాధికారులకు తెలియజేశారో.. లేదో కూడా తెలియని పరిస్థితి. ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షణ చేయకపోవడంతో కార్యకర్తలు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతోందన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పిల్లలకు సంబంధించిన ఆట వస్తువులు, రికార్డులు, గుడ్లు తదితరాల గురించి అడిగితే అప్పుడు ఆటో పిలిపించి, ఇంటి నుంచి అంగన్‌వాడీ కేంద్రానికి తరలించారు.



ఆటోలో సరుకులు, సామగ్రిని కేంద్రానికి తరలిస్తున్న దృశ్యం



అంగన్‌వాడీ కార్యకర్త ఇంట్లో ఉన్న పౌష్టికాహారం సంచులు

విచారిస్తాం

అంగన్‌వాడీలు ధర్నా చేసిన సమయంలో కొన్ని సెంటర్లకు రాష్ట్రవ్యాప్తంగా స్టాకు రాలేదు. పోషణ యాప్‌లో వివరాలు నమోదు చేయకున్నా స్టాకు అందదు. సూపర్‌వైజర్‌ను పంపి, వివరాలు సేకరించి, పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూస్తాం. - రెడ్డిరమణమ్మ, సీడీపీఓ

పెద్దారెడ్డిది హద్దు లేని అవినీతి

అక్రమంగా వందల కోట్ల సంపాదన.. తాడిపత్రి ప్రాంతానికి సాగు, తాగునీరు ఇస్తాం

రెడ్‌బుక్‌లో టీడీపీ వారిని ఇబ్బంది పెట్టిన వారి పేర్లు... తాడిపత్రి శంఖారావం సభలో నారా లోకేశ్



తాడిపత్రిలో నిర్వహించిన శంఖారావం సభలో మాట్లాడుతున్న నారా లోకేశ్, ఐక్యత చాటుతున్న నాయకులు

తాడిపత్రిటౌన్, మార్చి11: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అరాచకాలు, అవినీతికి హద్దే లేకుండా పోయిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. తాడిపత్రిలోని కడపరోడ్డులో సోమవారం టీడీపీ శంఖారావం సభ నిర్వహించారు. సభకు నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది మంది టీడీపీ అభిమానులు, కార్యకర్తలు హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన నారా లోకేశ్ మాట్లాడుతూ చింతల వెంకటరమణస్వామి, బుగ్గరామలింగేశ్వరస్వామి కొలువైన ఆధ్యాత్మిక కేంద్రం తాడిపత్రి అని పేర్కొన్నారు. ఈ నేలపై మహాత్మాగాంధీ నడిచారన్నారు. దివంగత ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసినప్పుడు మొట్టమొదట ఉద్యమించిన ప్రాంతం తాడిపత్రి అని తెలిపారు.

నా జీవితం తాడిపత్రి ప్రజలకు అంకితం



తాడిపత్రిలోని బుగ్గరామలింగేశ్వర స్వామి, సిద్ధిబాషా దర్గా, సీఎస్ఐ చర్చిల సాక్షిగా నా జీవితం తాడిపత్రి ప్రజలకు అంకితం. వారి అభివృద్ధికి నిరంతరం పనిచేస్తా. ప్రజాసమస్యలపై గళమెత్తడంలో నారా లోకేశ్ పోరాటపటిమను చూస్తున్నా. ఆయనను ఆదర్శంగా తీసుకొని ఎన్నికష్టాలు ఎదురైనా మా కార్యకర్తలు పోరాడుతున్నారు. తాడిపత్రి మున్సిపాలిటీని దేశంలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దడానికి నా తండ్రి జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన కృషి ఎనలేనిది. రాబోయే టీడీపీ-జనసేన ప్రభుత్వంలో తాడిపత్రిలో మౌలిక సదుపాయాలను కల్పించాలి. మా ప్రాంతంలోని రైతులు కష్టజీవులు. కన్నీటితోనైనా పొలాలను సాగుచేసే శక్తి మావారికి ఉంది. చాగల్లు, పెండేకల్లు రిజర్వాయర్లు, పెద్దవడుగూరు, యాడికి బ్రాంచ్ కెనాల్ నిర్మించినా నీటి కేటాయింపులు లేవు. మన ప్రభుత్వం రాగానే నీటి కేటాయింపులు జరిగేలా కృషి చేస్తా. మన ప్రభుత్వం రాగానే తాడిపత్రిని ఇండస్ట్రీయల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం.

- జేసీ అశ్మిత్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్

రు. బీసీలకు ప్రత్యేక చట్టం తీసుకువచ్చి భద్రత కల్పిస్తామన్నారు. తాడిపత్రిలో 1800టిడ్కో గృహాలను పూర్తిచేశామని, మరో 4500ఇళ్లను కట్టించి పేదలకు అందించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. దేశంలోనే ఆదర్శంగా నిలిచిన తాడిపత్రి మున్సిపాలిటీలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రస్తుతం ఏ పనులు చేయనీయడం లేదని దుయ్యబట్టారు.

ఇబ్బంది పెట్టిన వారికి వడ్డీతో చెల్లిస్తా

తాడిపత్రి ప్రాంతంలో వెయ్యి మంది టీ డీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారన్నారు. వీటిలో జేసీ ప్రభాకర్‌రెడ్డిపై 102 కేసులు పెట్టారన్నారు. ఏ తప్పు చేయని జేసీ అశ్మిత్‌రెడ్డిపై కూడా అక్రమ కేసులు పెట్టి తండ్రి, కొడుకులను జైలులో పెట్టించారని ఆరోపించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ప్రతి ఒక్కరి పేరు రెడ్‌బుక్కులో రాసుకున్నానని వడ్డీతో తాను వ్యక్తిగతంగా చెల్లిస్తానని హెచ్చరించారు.

అవినీతితో కోట్లకు పడగలెత్తిన ఎమ్మెల్యే

2019 ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చిన్నకార్లు వేసుకొని తిరిగేవాడన్నారు. ఎమ్మెల్యే అయ్యాక కోట్లరూపాయలు విలువగల కార్లలో తిరుగుతున్నాడన్నారు. ఇసుక, మట్టి, రియల్‌ఎస్టేట్, పరిశ్రమల్లో భారీ మొత్తంలో వసూలు చేసి వందల కోట్లకు పడగలెత్తాడన్నారు. చివరికి పందుల పెంపకందారులతో కూడా కప్పం వసూలు చేశాడన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పన్నులు, కరెంట్ బిల్లులతో గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమల యజమానులను ఇబ్బంది పెట్టారన్నారు. తాడేపల్లిలో జగన్‌రెడ్డి వసూలు చేస్తే, తాడిపత్రిలో పెద్దారెడ్డి దండుకుంటున్నాడని ఆరోపించారు. తాడిపత్రి ప్రాంతంలో 80శాతంమేర ఫ్యాక్టరీలు మూతపడ్డాయన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే వాటన్నింటిని తెరిపించి ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. చేనేత కార్మికులను ఆదుకుంటామన్నారు. పెండేకల్లు, చాగల్లు, యాడికి కాలువ, పెద్దవడుగూరు హెచ్చెల్సీకి నీరు తెప్పించి సాగు, తాగునీరు అందించే బాధ్యత తనదని తెలిపారు. మైనార్టీలకు రద్దు చేసిన పథకాలను పునరుద్ధరిస్తామని ప్రకటించారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎప్పటికి యువకుడే

అభివృద్ధి విషయంలో తన తండ్రి నారా చంద్రబాబునాయుడు, జేసీ అశ్మిత్‌రెడ్డి తండ్రి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎప్పటికి యువకులుగానే ఆలోచిస్తారని పేర్కొన్నారు. తాను పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉన్న సమయంలో తాడిపత్రి అభివృద్ధి కోసం రూ.2వేల కోట్లు మంజూరు చేసేంతవరకు పట్టువదలని విక్రమార్కుడు జేసీపీఆర్ వెంటపడ్డాడని కొనియాడారు. 40ఏళ్ల పాటు అభివృద్ధికి పాటుపడిన జేసీ కుటుంబాన్ని కాదని 2019ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేసి గెలిపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తాడిపత్రిలో మాత్రమే టీడీపీ గెలవడానికి జేసీపీఆర్ చేసిన అభివృద్ధే కారణమన్నారు. అందుకే నిరంతరం అభివృద్ధి మంత్రం జపించే జేసీ కుటుంబానికి ఎన్నికల్లో అండగా ఉండి జేసీ అశ్మిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి తనతోపాటు అసెంబ్లీకి పంపాలని ప్రజలను కోరారు. తాడిపత్రికి ఇచ్చిన హామీలన్ని నెరవేర్చే బాధ్యత తనదని తెలిపారు

జేసీపీఆర్‌పై పెట్టినన్ని అక్రమ కేసులు దేశంలో ఎవ్వరిపైనా పెట్టలేదు



తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై వైసీపీ ప్రభుత్వం పెట్టినన్ని అక్రమ కేసులు దేశంలో ఏ రాజకీయ నాయకుడిపై పెట్టలేదు. ఎన్నికేసులు పెట్టినా ప్రజల అభివృద్ధి కోసం జేసీపీఆర్ ఏమాత్రం వెనుకంజ వేయలేదు. ఆయన వారసుడిగా ప్రజల్లోకి వచ్చిన జేసీ అశ్మిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి.

- కాలవ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా జనసైనికులు పనిచేయాలి



ఉమ్మడి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా జనసైనికులు పనిచేయాలి. తాడిపత్రిలో ఐదేళ్లుగా అభివృద్ధి కుంటుపడటంతోపాటు రాక్షస పాలన సాగుతోంది. మున్సిపల్ చైర్మన్‌గా జేసీ ప్రభాకర్ రెడ్డిని గెలిపించినప్పటికీ ఎమ్మెల్యే ఏ అభివృద్ధి పని చేయనీయడం లేదు. ప్రజలు అభివృద్ధి కోసం పెద్దారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆయన మాత్రం ప్రతిపక్షనేతల ఇళ్లపైకి మారణాయుధాలతో వెళుతున్నారు. మా అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాలే నాకు, మా నాయకులు, కార్యకర్తలకు శిరోధార్యం. జేసీ అశ్మిత్‌రెడ్డి గెలుపునకు అవిశ్రాంతిగా కృషి చేస్తా.

- కదిరి శ్రీకాంత్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి

టీడీపీ ఫ్లెక్సీలు ధ్వంసం

తాడిపత్రిటౌన్, మార్చి11: శంఖారావం సభను పురస్కరించుకొని పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లికాలనీలోని ఎమ్మార్పీ భవనం వరకు టీడీపీ వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సోమవారం తెల్లవారుజామున వైసీపీ మద్దతుదారులు ధ్వంసం చేశారని టీడీపీ నాయకులు ఆరోపించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ, చింబిలి ప్రసాద్‌నాయుడు, రాము, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ధ్వంసం చేశారని వారన్నారు.





ధ్వంసం చేసిన ఫ్లెక్సీలు

అవినీతి ఎమ్మెల్యే అనంత..!

కమీషన్ తీసుకోనిదే పనిచేయడు

పాపాల పెద్దిరెడ్డి జిల్లాకొస్తే తరిమికొట్టండి

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్



మాట్లాడుతున్న నారా లోకేశ్

అనంతపురం అర్బన్, మార్చి 11: అనంత వెంకటరామిరెడ్డి అవినీతి ఎమ్మెల్యే అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. చేతగాని, కమీషన్లు తీసుకునే ఎమ్మెల్యే ఆయన అని విమర్శించారు. ఆయనకు '9 నంబర్స్' ఎమ్మెల్యే అని పేరు ఉందని, ఎవరైనా వెళితే హడావుడిగా 9 నంబర్లతో ఫోన్ చేసి బిల్డప్ ఇస్తారని ఎద్దేవా చేశారు. జగన్ మాదిరిగా ఇక్కడ ఈయన బిల్డప్ ఇస్తున్నారని, పనులు చేయలేని చేతగాని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అని విమర్శించారు. పీవీకేకే కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు. పాపాల పెద్దిరెడ్డి చిత్తూరు జిల్లాను అడ్డగోలుగా దోచేశారని, ఎక్కడ పేదోడి భూమి కనబడినా దోచేస్తారని, దొంగ పత్రాలు సృష్టిస్తారని ఆరోపించారు. బాధితుల తరుపున పోరాడిన వారిపై రౌడీషీట్‌లు ఓపెన్ చేయిస్తారని అన్నారు. అక్కడ దోచింది చాల్లేదని అనంతపురం జిల్లాపై పడ్డారని మండిపడ్డారు. పాపాల పెద్దిరెడ్డి వస్తే తరిమి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. పాపాల పెద్దిరెడ్డిని పొరపాటున రానిస్తే మన ఇంటిపైన చిప్పకూడా మిగల్చరని హెచ్చరించారు.

చైతన్యం ఎక్కువ..

విద్యావంతులు పుట్టిన నేల అనంతపురం నగరం అని అన్నారు. అనంతపురం ప్రజలకు రాజకీయ చైతన్యం ఎక్కువ అని లోకేశ్ అన్నారు. ఆనాడు అన్న ఎన్టీఆర్‌ను బర్తరఫ్ చేస్తే అనంత నుంచే ఉద్యమం ప్రారంభమైందని గుర్తు చేశారు. 2014-19 టీడీపీ హయాంలో వైకుంఠం ప్రభాకర్ చౌదరి నాయకత్వంలో రూ.1500 కోట్లు ఖర్చు పెట్టి అనంతపురం అర్బన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని అన్నారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, బ్రిడ్జిలు, పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, తాగునీటి పథకాలు అందించింది తెలుగుదేశం పార్టీనే అని అన్నారు. ఆరువేల టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు చేశామని, మిగిలిన 10 శాతం పనులు కూడా దద్దమ్మ ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. అనంత పట్టణానికి తాగు నీటి కోసం రూ.91 కోట్లతో పైపు లైన్లు వేశామని, 11 రిజర్వాయర్లు ఏర్పాటు చేసి, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని అన్నారు. ఈ దద్దమ్మ ప్రభుత్వానికి కనీసం పైపు లైన్లను వాడుకోవడం కూడా చేతకావడం లేదని అన్నారు. స్టేడియాన్ని అభివృద్ధి చేశామని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించామని అన్నారు. ఆ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తగిన డాక్టర్లను నియమించ లేని స్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని అన్నారు. టీడీపీ, జనసేన అభ్యర్థిని అనంత అర్బన్‌లో భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి రాగానే ఔటర్ రింగ్ రోడ్డు, అనంతలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో టిడ్కో ఇళ్లు పూర్తి చేసి పేదలకు అందజేస్తామని అన్నారు. గుత్తి రోడ్డులోని డంపింగ్ యార్డును తరలించి, మోడరన్ డంపింగ్ యార్డు తీసుకొచ్చే బాధ్యత తనదని అన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాల నిర్వహణలో బాగా పనిచేసిన వారికి ఉత్తమ కార్యకర్త అవార్డులను అందజేశారు.

అలుపెరగని యోధుడు లోకేశ్

- ప్రభాకర్ చౌదరి



యువగళం పాదయాత్ర ద్వారా నవగళాన్ని వినిపించిన అలుపెరగని యోధుడు నారా లోకేశ్ అని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి కొనియాడారు. టీడీపీ హయాంలో పంచాయతీరాజ్ మంత్రిగా తనదైన ముద్ర వేశారని అన్నారు. యువగళంలో స్థానిక వైసీపీ ప్రజాప్రతినిధుల అవినీతి, అక్రమాలను ఎండగట్టి, పార్టీ శ్రేణులలో నూతన ఉత్తేజాన్ని నింపారని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో శంఖారావం ద్వారా సమర శంఖం పూరించి, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గౌరవించడంతోపాటు వైసీపీ ఆగడాలను ఎండగడుతున్నారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల యుద్ధానికి కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్ పాలనలో వ్యత్యాసాలను ప్రజలు గమనించాల్సిన అవసరం ఉందని అన్నారు. వైఎస్సార్, జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్ర చేస్తే అధికారంలో ఉన్న చంద్రబాబు ఎలాంటి ఇబ్బందులు సృష్టించలేదని, ప్రభుత్వపరంగా సహకరించారని అన్నారు. చంద్రబాబు, నారా లోకేశ్ పాదయాత్ర చేసిన సమయాల్లో అనేక అడ్డంకులు సృష్టించారని, వాటని అధిగమించి ఇద్దరు నాయకులు పాదయాత్రను కొనసాగించారని అన్నారు. సీఎం జగన్‌ను వైసీపీ ఎమ్మెల్యేలు నేరుగా కలిసే పరిస్థితి లేదని అన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తన వియ్యంకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండ చూసుకొని రాజ్యాంగేతర శక్తిగా మారాడని విమర్శించారు. సుభాష్ రోడ్డు, గుత్తి రోడ్డులను టీడీపీ హయాంలో మంజూరు చేయించామని, ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభించలేపోయామని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కమీషన్ల నొక్కేందుకు రోడ్డు పనులను ఉపయోగించుకున్నారని ఆరోపించారు. రాజీవ్ కాలనీలో టీడీపీ హయాంలో బ్రిడ్జి నిర్మిస్తే, జగనన్న వారధి అని పేరు పెట్టుకున్నారని విమర్శించారు. ఎంపీగా లోక్ సభలో, ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ఏ నాడు ప్రజల సమస్యలపై అనంత వెంకటరామిరెడ్డి నోరుమెదపలేదని, అలాంటి వ్యక్తి అభివృద్ధి అంతా తానే చేశానని అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. అనంత అన్నదమ్ములు శాఖలు పంచుకొని మామూళ్లు దండుకుంటున్నారని ఆరోపించారు. అనంత వెంకటరామిరెడ్డి మాదిరిగా తాను అవినీతికి పాల్పడలేదని అన్నారు. నిజాయితీ, నిబద్ధతతో అనంత అర్బన్ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పనిచేశానని అన్నారు. తన ఊపిరి ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీ కోసం, చంద్రబాబును సీఎంను చేసుకునేందుకు, సైకో జగన్ పారదోలేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.



సూపర్‌సిక్స్ బ్యాగు ప్రభాకర్‌చౌదరికి అందజేస్తున్న నారా లోకేశ్

కార్యకర్తలను రెచ్చగొడుతున్నాడు

- టీసీ వరుణ్



వైసీపీ సిద్ధం సభలకు బస్సులు పెట్టి, మందు, బిర్యానీలు ఇచ్చి జనాన్ని బలవంతంగా తరలిస్తున్నారని జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ అన్నారు. సిద్ధం సభల్లో సెల్ఫ్ డబ్బా కొట్టుకోవడం తప్ప సీఎం జగన్ చేసిందేమీ లేదని అన్నారు. నారా లోకేశ్ శంఖారావం సభలకు టీడీపీ, జనసేన కార్యకర్తలు నిస్వార్థంగా వస్తున్నారని అన్నారు. రోడ్లపైకి వచ్చి ఓట్లు అడిగే పరిస్థితిలో జగన్ లేరని, అందుకే సిద్ధం సభల్లో కార్యకర్తలను రెచ్చగొట్టి, మీడియా ప్రతినిధులపై దాడులు చేసి మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్నారని అన్నారు. దేనికోసం సిద్ధం సభలు పెడుతున్నారు అని సీఎం జగన్‌ను నిలదీశారు. 'రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేనందుకా? ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీ వేతనాలు ఇవ్వనందుకా? నిరుద్యోగులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నందుకా? పంటనష్టపోయిన రైతులకు న్యాయం చేయలేనందుకా? రోడ్డు వేయనందుకా..? మద్యం ఏరులై పారించేందుకా..? నువ్వు, నీ ఎమ్మెల్యేలు ఇసుకను అడ్డగోలుగా అమ్ముకునేందుకా..?' అని ప్రశ్నలు సంధించారు. 'హు కిల్డ్ బాబాయ్?' అనే ప్రశ్నకు సమాధానం చెప్పి ప్రజలను ఓట్లు అడగాలని సూచించారు. ఇలాంటి అసమర్థ సీఎంను ఎన్నడూ చూడలేదని అన్నారు. టీడీపీ, జనసేన కూటమితో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారని అన్నారు. డంపింగ్ యార్డు మార్పు, అండర్‌డ్రైనేజీ నిర్మాణం హామీలు గాలికి వదిలేశారని అన్నారు. అనంత అర్బన్‌లో పారిశుధ్య సమస్య అధికంగా ఉందని, రోడ్లు అధ్వాన్నంగా మారాయని అన్నారు. గత రెండు నెలలుగా తాగునీరు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో అనంత అర్బన్‌లో సమస్యలన్నీ పరిష్కారమవుతాయని అన్నారు. చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ అనంత అర్బన్ విషయంలో ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి, భారీ మెజార్టీతో అభ్యర్థిని గెలిపించుకుంటామని అన్నారు.



హాజరైన నాయకులు, కార్యకర్తలు

40 డిగ్రీల చేరువలో ఉష్ణోగ్రతలు

బుక్కరాయసముద్రం, మార్చి 11: ఈ ఏడాది మార్చిలోనే సూరీడు మండిపోతున్నాడు. ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇప్పటికే 40 డిగ్రీల చేరువలో ఉన్నాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మార్చి తొలివారంలోనే జిల్లాలో శింగనమల మండలం తరిమెల గ్రామంలో అత్యధికంగా 41 డిగ్రీల సెల్సియస్ నమోదు అయ్యిందని, రానున్న రోజుల్లో ఈ ఏడాది 47, 48 డిగ్రీల సెల్సియస్ కూడా నమోదయ్యే అవకాశాలున్నాయని ఐఎండీ వాతావరణ శాఖ ఇప్పటికే జిల్లా వాతావరణ నిపుణులకు ముందస్తు సమాచారం చేరవేసింది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో మార్చి నుంచి మే వరకు ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటాయని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ శాస్త్రవేత్త గుత్తా నారాయణ స్వామి తెలిపారు. ఈ ఏడాది పసిఫిక్ మహాసముద్రంలో వచ్చే మార్పుల కారణంగా ఎల్‌నినో పరిస్థితి ఏర్పడుతుందని, అందువల్ల వేసవి కాలం మరింత వేడిగా మారుతుందని వాతావరణ శాస్త్రవేత్త సూచించారు. ప్రస్తుతం ఉదయం 9 గంటలు దాటితే సూరీడు భగభగ మండిపోతున్నాడు. బయటకు పోవాలంటే ప్రజలు భయందోళన చెందుతున్నారు. మండే ఎండలకు తోడు... వడగాల్పులు ఉమ్మడి జిల్లాలో మొదలయ్యాయి. ఆదివారం పామిడి మండలంలో వడదెబ్బతో పండ్లు అమ్ముకునే ఓబిలేసు (48) మరణించిన విషయం తెలిసిందే.

అనంత జిల్లాలో ఉష్ణోగ్రతల వివరాలు

అనంతపురం జిల్లాలో సోమవారం అత్యధికంగా బొమ్మనహల్ 38.79, కూడేరు 38.67 అనంతపురం 38.59, శింగనమల 38.57, పామిడి 38.5, యల్లనూరు 38, గుమ్మగట్ట 37.91 నమోదు అయ్యాయి.

శ్రీసత్యసాయి జిల్లాలో...

రామగిరి 38.59, కొత్తచెరువు 38.53, ముదిగుబ్బ 38.5, పరిగి 38.5, ధర్మవరం 38.29, రొద్దం 37.82, బత్తలపల్లి 37.79 నమోదయ్యాయి.

నేడు గుంతకల్లు మీదుగా వందే భారత్ రైలు ప్రారంభం

గుంతకల్లు, మార్చి 11: రైల్వే డివిజన్‌లోని వివిధ స్టేషన్ల మీదుగా వెళ్లే వందే భారత్ రైలును ప్రధానమంత్రి మంగళవారం ప్రారంభించనున్నట్లు సీనియర్ డీసీఎం మనోజ్ నాగరాజన్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం స్థానిక డీఆర్ఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో సీనియర్ డీసీఎం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, మరికొన్నింటికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలియజేశారు. అందులో భాగంగా కలబురగి-బెంగళూరు మధ్య వందే భారత్ రైలును ప్రారంభిస్తారన్నారు. ఈ రైలు రైల్వే డివిజన్‌లోని రాయచూరు, మంత్రాలయం, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. డివిజన్‌లోని తిరుపతి-కొల్లాం, బెంగళూరు-గుల్బర్గ మధ్య కూడా వందే భారత్ రైళ్లను ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. గుంతకల్లు-గుంటూరు సెక్షన్‌లో డబ్లింగ్ కార్యక్రమంలో భాగంగా పాక్షికంగా పూర్తయిన 303 కి.మీ.ల లైన్‌ను జాతికి అంకితం చేయనున్నట్లు తెలిపారు. ఈ రూటులో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు గ్రీన్ సిగ్నల్ లభించనుందన్నారు. వన్ స్టేషన్-వన్ ప్రొడక్ట్ పథకం కింద రైల్వే డివిజన్‌లో 23 విక్రయ కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. గతి శక్తి కార్గో టెర్మినల్‌గా ప్రారంభమైన నక్కనదొడ్డి ఐటీసీ టెర్మినల్‌లోపాటు, మరో రెండు టెర్మినళ్లను జాతికి అంకితం చేయనున్నారని తెలియజేశారు. సమావేశంలో డీసీఎం సోమశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

అయ్యో.. పాపం..!

ఆటో ఢీకొని చిన్నారి దుర్మరణం




షాహిదా (ఫైల్)

బత్తలపల్లి, మార్చి 11: స్థానిక బృందావన కాలనీలో సోమవారం ఆటో ఢీకొని చిన్నారి షాహిదా (2) దుర్మరణం చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. షేక్ బాషా, ఫాతిమా దంపతులకు ఏడుగురు సంతానం.ఆరో సంతానమైన షాహిదా ఇంటి ముందు ఆడుకుంటుండగా తాగునీటి ఆటో ఢీకొట్టింది. ఆటోను ఆపకుండా వెళ్లిపోతుండగా.. స్థానికులు గమనించి, అడ్డుకున్నారు. ఆటోను ఆపి చిన్నారిని పరిశీలించగా అప్పటికే మృతిచెందింది. కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఏఎస్ఐ సోమశేఖర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

పట్టపగలే దోపిడీ

దుకాణంలోకి చొరబడిన దుండగులు

మహిళ గొంతుకోసి.. బంగారు, నగదు అపహరణ



గాయపడిన అమృత

ధర్మవరం, మార్చి 11: ధర్మవరంలో పట్టపగలే దుండగులు దోపిడీకి తెగబడ్డారు. పట్టణంలోని పుట్టపర్తికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన రద్దీగా ఉండే ప్రాంతంలో ఓ దుకాణంలోకి గుర్తుతెలియని దుండగులు చొరబడ్డారు. దుకాణంలోని మహిళ గొంతుకోసి బంగారు చైను, కొంత నగదు అపహరించుకెళ్లారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో సోమవారం ఈ ఘటన భయాందోళనలు రేకెత్తించింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన అమృత అనే మహిళ ఇంటి వద్ద జనరల్ స్టోర్ నిర్వహిస్తోంది. గుర్తుతెలియని దుండగులు ముగ్గురు సోమవారం మధ్యాహ్నం దుకాణంలోకి చొరబడ్డారు. అమృత గొంతుకోసి, మెడలోని గొలుసు లాక్కుని, దుకాణంలోని నగదు ఎత్తికెళ్లారు. ఆ సమయంలో అమృత కుటుంబసభ్యులు వేరే గ్రామానికి వెళ్లారు. గాయపడిన ఆమెను స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, విచారణ చేపట్టారు. ఇటీవలిగా పట్టణంలో చోరీలు అధికమవడంతో జనం భయాందోళన చెందుతున్నారు. ఈ చోరీలు.. పోలీసులకు సవాల్‌గా మారాయి.

స్వయం సహాయక సంఘాలకు కేంద్రం రూ.121 కోట్లు నిధులు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 11: జిల్లాలో కరువును దృష్టిలో ఉంచుకుని స్వయం సహాయక మహిళా సంఘాలకు కేంద్రప్రభుత్వం రూ.121 కోట్ల నిధులు మంజూరు చేసిందని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి, ఎల్‌డీఎం సత్యరాజ్ తెలిపారు. సోమవారం ఢిల్లీ నుంచి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వయం సహాయక మహిళా సంఘాల జీవనోపాధుల పెంపునకు లఖ్‌పతి దీదీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వం జిల్లాలో ఎంపిక చేసిన 1,464 స్వయం సహాయక సంఘాలకు మంజూరు చేసిన రూ.121 కోట్ల చెక్‌ను పీడీ, ఎల్‌డీఎం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ వైకేపీ ఏపీడీ ఈశ్వరయ్య, ప్రాజెక్ట్ మేనేజర్లు రాధారాణి, సత్యనారాయణ, చంద్రధర్, ఏపీఎంలు, స్వయం సహాయక సంఘాల మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.



11వ వార్డులో ప్రచారం చేస్తున్న కందికుంట యశోదమ్మ

కందికుంట యశోదమ్మ ఇంటింటి ప్రచారం

కదిరి, మార్చి 11: పట్టణంలోని 11వ వార్డులో సోమవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. వార్డులో ప్రజలకు ఆమెకు అపూర్వ స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పగిలిన గుండె

భర్త హత్యను జీర్ణించుకోలేక శోభ మృతి



భర్తతో శోభ (ఫైల్)

అనంతపురం క్రైం, మార్చి 11: ఎస్కేయూ గెస్ట్ లెక్చరర్ మూర్తిరావు హోకలే హత్యను జీర్ణించుకోలేక.. ఆయన భార్య గుండె పగిలింది. మూర్తి రావు మృతిచెందిన కొన్ని గంటలకే ఆయన భార్య శోభ(56) గుండెపోటుతో ప్రాణాలు విడిచారు. దీంతో వారి కుటుంబంలో అంతులేని విషాదం అలుముకుంది. జేఎన్‌టీయూ ఎదురుగా ఉన్న మూర్తి రావు హోకలే ఇంట్లోకి వెళ్లి ఆయన అల్లుడు ఆదిత్య ఆదివారం రాత్రి కత్తితో దాడి చేశారు. దీంతో మూర్తిరావు ప్రాణాలు కోల్పోయారు. ఆసుపత్రిలో భర్త మృతదేహం వద్ద విలపిస్తూ శోభ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆమెకు గుండెపోటు రావడంతో అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాసేపటికే ఆమె మృతి చెందారు. దంపతులిద్దరూ గంటల వ్యవధిలో ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం కన్నీటి సంద్రంలో మునిగింది. వారి పిల్లలు రోదిస్తున్న తీరు స్థానికులను కంటతడిపెట్టించింది. శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం పిన్నదరి జెడ్పీ హైస్కూల్‌లో శోభ టీచర్‌గా పని చేస్తున్నారు. కుమారుడు ఉజ్వల్ హైదరాబాద్‌లో, కుమార్తె వైష్ణవి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలు కోర్టుకు సమర్పించాలి

- సీపీఎం డిమాండ్



ధర్మవరం ఎస్‌బీఐ వద్ద సీపీఎం నాయకుల ధర్నా

కదిరి అర్బన్, మార్చి 11: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని, ఈబాండ్ల వివరాలను కోర్టుకు సమర్పించాలని కోరుతూ పట్టణంలోని సీపీఎం నాయకులు సోమవారం స్థానిక స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ ఫణికుమార్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఈ బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ సుప్రీంకోర్టు రద్దు చేసిందన్నారు. బాండ్ల వివరాలను కోర్టుకు సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించినా, కేంద్రం వివరాలివ్వకుండా కాలయాపన చేస్తోందన్నారు. ఎస్‌బీఐ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం తక్షణమే ఎలక్టోరల్ బాండ్ల విషయాన్ని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బడా సుబ్బిరెడ్డి, జీఎల్ నరసింహులు, లక్ష్మీనారాయణ, జగన్, రామమోహన్, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం : ఎస్‌బీఐ కోర్టును ధిక్కరించడాన్ని నిరసిస్తూ పట్టణంలోని సీపీఎం నాయకులు స్థానిక మార్కెట్‌లో గల ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ... ఎస్‌బీఐ ఎలక్టోరల్ బాండ్ల వివరాలను కోర్టుకు వివరించాలని డిమాండ్ చేశారు. ఎస్‌బీఐ పూర్తిగా కేంద్రం ఆధీనంలోకి వెళ్లడం సరికాదన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయూ మండలాధ్యక్షుడు ఎల్ ఆదినారాయణ, రైతుసంఘం మండల అధ్యక్షుడు మారుతి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, నాయకులు పాల్గొన్నారు.

తనకల్లు: మండలకేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ ఎదుట సీపీఎం, రైతు సంఘం నాయకులు బైఠాయించి ధర్నా చేశారు. ఎస్‌బీఐ ఎలక్టోరల్ బాండ్లను విక్రయించి వివరాలను కోర్టుకు వెల్లడించడం లేదన్నారు. ఇందుకుగాను ధర్నా చేపట్టామన్నారు. ఎస్‌బీఐ వెంటనే వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివన్న, రైతు సంఘం నాయకులు వీవీ రమణ, రమణ తదితరులున్నారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

ముదిగుబ్బ, మార్చి11: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. సమావేశం ప్రారంభం కాగానే ఎంపీటీసీ-1 సభ్యురాలి భర్త, సచివాలయ కన్వీనర్ మల్లాగుండ్ల భాస్కర్ మాత్రం నీటి ఎద్దడి గురించి అధికారులపై మండిపడ్డాడు. ట్యాంకర్లతో ఇప్పుడు నీటి సరఫరా చేసినా ఎన్నికల కోడ్ సమీపిస్తుండడంతో బిల్లులు మంజూరు కావని, కాగా తాగునీటి సమస్య అధికంగా ఉండడంతో ప్రజల్లోకి తాము ఎలా వెళ్లాలంటూ ప్రశ్నించారు. ఈ చర్చలో మాటామాటా పెరగడంతో ఆయన మాట్లాడుతున్న మైకును విసిరికొట్టి, ఆగ్రహంగా బయటికి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఎలాంటి సమస్యలు ప్రస్తావనకు రాలేదు. మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు నామమాత్రంగానే హాజరు కావడంతో సమావేశం తూతూ మంత్రంగా సాగింది.

ప్రొటోకాల్ పాటించరా..?

- నా పంచాయతీలో జరిగే కార్యక్రమాలకు నన్నే పిలవకపోతే ఎలా?
- స్థానిక అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా
- టీడీపీ మద్దతు సర్పంచ్ ముత్యాలప్పనాయుడు



మాట్లాడుతున్న సర్పంచ్ ముత్యాలప్పనాయుడు

ధర్మవరం రూరల్, మార్చి 11: ఆయన ప్రజలచే ఎన్నుకున్న ప్రజాప్రతినిధి. గ్రామానికి ఆయనే సుప్రీం. గ్రామపంచాయతీలో జరిగే ఏ కార్యక్రమైనా ఆయన అనుమతి తప్పనిసరి. అయితే ఆ గ్రామ సర్పంచ్ టీడీపీ మద్దతుదారుడు కావడంతో ఆ గ్రామ పంచాయతీలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు ఆహ్వానం అందించడం లేదు. కనీసం ప్రొటోకాల్ ప్రకారం కూడా ఆహ్వానించకుండా అధికారులు ఏకపక్షధోరణిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం మండలంలోని ఉప్పునేసినపల్లి పంచాయతీ గరుడంపల్లి వద్ద వేరుశనగ ప్రాసిసెంగ్ యూనిట్ కోసం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భూమిపూజ చేశారు. అయితే కార్యక్రమానికి ఆ గ్రామసర్పంచ్ ముత్యాలప్పనాయుడుని ఆహ్వానించలేదు. ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానించాల్సి ఉండగా అధికారులు ఎవరూ కూడా ఆయన్ను పిలవలేదు. దీంతో సర్పంచ్ మాట్లాడుతూ తన పంచాయతీలో జరిగే ఏ ప్రభుత్వ కార్యక్రమానికి అధికారులు ఆహ్వానించలేదన్నారు. కేవలం టీడీపీ మద్దతుదారుడు కావడంతోనే తనను పిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఎవరూ కూడా ప్రొటోకాల్ పాటించలేదని మండిపడ్డారు. ప్రొటోకాల్ వ్యవహారంపై గ్రామ, మండల అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

స్పందనకు అధికారుల డుమ్మా

- వెలవెలబోయిన కార్యక్రమం

ఓబుళదేవరచెరువు, మార్చి 11: ప్రజాసమస్యల కోసం సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన అధికారులు లేక వెల వెలబోయింది. మధ్యాహ్నం 12గంటలైనా త హసీల్దార్ ఖాజాబీ, హార్టికల్చర్ లావణ్య, పీహెచ్‌ఎన్ దిల్‌షాద్ మినహా ఏ ఒక్క అధికారి హాజరుకాలేదు. ప్రతి వారమూ ఇదే తంతు జరుగుతోందని, అధికారులు సరిగా హాజరు కావడం లేదని, ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ అధికారుల తీరు షరా మామూలైందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని స్పందనకు అందరు అధికారులు హాజరయ్యేలా చూడాలని వారు కోరుతున్నారు.

సూపర్‌సిక్స్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లండి



ధర్మవరంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు



ఓడీసీలో సూపర్ సిక్స్‌పై ప్రచారం నిర్వహిస్తున్న తెలుగుదేశం శ్రేణులు

- టీడీపీ కార్యకర్తలకు నాయకుల పిలుపు

ధర్మవరం, మార్చి 11: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన శంఖారావం-సూపర్‌సిక్స్‌కు సంబంధించిన కరపత్రాలను కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ పథకాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఇంటింటా తిరిగి ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతోందని, కార్యకర్తలందరూ టీడీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, గోసలశ్రీరాములు, తొగటఅనిల్, చీమల రామాంజి, గం గాద్రి, పవన్‌కుమార్, వీరయ్య, చీమలసందీప్, క్లస్టర్ రామాంజి, బాబు, అమర్నాథ్‌చౌదరి, రవి, నాగమణి, రక్షిత, రాజేశ్వరి, భాను తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలోని బీసీ కాలనీల్లో సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ మైనార్టీ జిల్లా కార్యదర్శి మండోజీ ఆర్ఫిఖాన్, నియోజకవర్గ కార్యదర్శి పొగాకు షబ్బీర్ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలకు కరపత్రాలు పంచుతూ పథకాల గురించి వివరించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజలకు, రైతులకు మేలు జరగాలన్నా టీడీపీతోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును సీఎం చేసుకుందామని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ మహిళా నేత మస్తానమ్మ, బూత్ కన్వీనర్ మండోజీతోఫిక్ ఖాన్, అబ్లు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



బుక్కపట్నంలో విద్యార్థులకు అయోడిన్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పుట్టపర్తి రూరల్, మార్చి 11: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు డాక్టర్ జ్యోత్స్న పేర్కొన్నారు. ఈమేరకు ఆరోగ్యకేంద్రం పరిధిలోని మండలప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆమె పౌష్టికాహారం, అయోడిన్ ఉప్పు వాడకంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు ఆరోగ్యవంతమైన జీవితం గడపాలంటే పౌష్టికాహారంతో పాటు అయోడిన్ ఉప్పును క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. అయోడిన్ లోపం ఉంటే బుద్ధిమాంధ్యం కలుగుతుందని, అధికబరువుకు, జుట్టు రాలడం, ఋతుచక్రం దెబ్బతినడం వంటి ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని తెలిపారు. కనుక ప్రతిఒక్కరూ శరీరంలో అయోడిన్ తగ్గకుండా జాగ్రత్త పడాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నగేష్, పీహెచ్‌ఎన్ లలితకుమారి, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం సునీత, సూపర్‌వైజర్ చంద్రకళ, ఉపాధ్యాయిలు, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అయోడిన్ తగ్గితే ఆరోగ్యానికి హాని

బుక్కపట్నం: మానవశరీరంలో ఆయోడిన్ తగ్గితే ఆరోగ్యానికి హానికరమని వైద్యులు నివేధిత, సునీల్, బాలాజీ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని బాలుర పాఠశాలలో వారు 12 ఏళ్ల లోపు వయసున్న 90మంది బాలబాలికలకు అయోడిన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ అయోడిన్ లోపముంటే పిల్లల్లో మానసిక, శరీరక ఎదుగుదల లోపిస్తుందన్నారు. కావున తప్పకుండా అయోడిన్ ఉన్న ఉప్పునే వాడాలని సూచించారు. చేపలు, రొయ్యలు, పాలు, గుడ్ల ద్వారా కూడా అయోడిన్ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామక్రిష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ లింగా రామమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్: జాతీయ అయోడిన్ డిజార్డర్ కార్యక్రమాన్ని మండలంలోని దర్శినమల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు పుష్పలత, దీలీప్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలకు అయోడిన్ లోపం ఉంటే అలసట, బలహీనత, బరువు పెరగటం, ఆసహనం వంటి సమస్యలు వస్తాయని తెలిపారు. అయోడిన్ ఉప్పు ప్రతిఇంటిలో వాడాలని తెలిపారు. ఆయోడిన్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు అయోడిన్ పరీక్ష చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, సీహెచ్‌ఓ కళావతి, హెల్త్‌సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో స్పందనకు 165 వినతులు



జిల్లా పోలీసు కార్యాలయంలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి, మార్చి 11: జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 165 వినతిపత్రాలు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఈ వినతులను అందించారు. కలెక్టర్ అరుణ్‌బాబు వాటిని స్వీకరించి పరిశీలించారు. వంద శాతం వికలాంగత్వం ఉన్నా.. కేవలం రూ. 3వేలు మాత్రమే పింఛన్ వస్తోందని, పింఛన్ పెంచాలంటూ ఓం ప్రకాశ్, దీపక్, రమేష్‌లు వినతిపత్రం ఇచ్చారు. అలాగే తాము సాగులో ఉన్న భూమిని మరొకరికి పట్టా ఇచ్చారని, తనకు న్యాయం చేయాలని పుట్టపర్తికి చెందిన భాస్కర్ కలెక్టర్‌కు విన్నవించారు. ఇలా పలు సమస్యలను ప్రజలు కలెక్టర్‌కు వినతుల రూపంలో తెలియజేశారు. ఇందుకు కలెక్టర్ మాట్లాడుతూ ఈ సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని ఆయా అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం వహించరాదని తెలిపారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 24 వినతులు

పుట్టపర్తి రూరల్: జిల్లాకేంద్రంలోని జిల్లా పోలీసుకార్యాలయంలో నిర్వహించిన స్పందనకు 24 వినతిపత్రాలు వచ్చాయి. జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వాటిని అందించగా.. ఎస్పీ మాధవరెడ్డి స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ స్పందన కార్యక్రమంలో వినతుల ద్వారా తెలిపిన సమస్యలను చట్టపరిధిలో ఉంటే తప్పక పరిష్కరిస్తామన్నారు. తర్వాత సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌చేసి ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమలో ఎక్కువగా రస్తా వివాదాలు, కుటుంబకలహాలు, భూవివాదాలు, ఆర్థిక మోసాలపై వినతులు వచ్చారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఏఎస్పీ విష్ణు, దిశ డీఎస్పీ శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ విశ్వనాథరెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: ఆర్డీఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి రూరల్/ పుట్టపర్తి, మార్చి 11: ప్రస్తుత సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆర్డీఓ భాగ్యరేఖ సూచించారు. జిల్లాకేంద్రంలోని జిల్లా సమాఖ్య కార్యాలయంలో సోమవారం మహిళాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం మహిళల్లో చైతన్యం వస్తోందన్నారు. ఇంకా అన్ని రంగాల్లోనూ రాణించేందుకు కృషి చేయాలన్నారు. మహిళల చైతన్యాన్ని చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సిద్దగంగమ్మ, జిల్లా సిరికల్చర్ జేడీ పద్మమ్మ, బీసీ వెల్ఫేర్ అధికారిణి నిర్మలాజ్యోతి, మాట్లాడుతూ మహిళలు ప్రతి రంగంలోనూ తన ప్రతిభను చాటుతూ ఆబలలు కారు సబలలు అని నిరూపి స్తున్నారన్నారు. అవకాశాలు వస్తే ఎలాంటి లక్ష్యాలనైనా సాధిస్తారన్నారు. తర్వాత మహిళలకు పలు పోటీలు నిర్వహించిన విజేతలైన వారికి బహుమతులను అందజేశారు. అలాగే ఆర్డీఓ పాటు పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం రామమోహన్, డీపీఎం రామిరెడ్డి, 32 మండలాల మండల సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు డీఆర్‌డీఏ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

తనకల్లు: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం మల్లికార్జున ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ మహిళల సేవల్ని కొనియాడారు. రానున్న కాలంలో మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. అనంతరం. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినులు రత్నాబాయి, మంజుల, సతీష్‌కుమారి, అమరావతి, లక్ష్మీబాయి, పద్మావతి, సుజాత, ఆఫ్రీన్ భానులను ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఓబుళదేవరచెరువు, మార్చి 11: మండలకేంద్రంలోని ప్రాథ మిక వైద్యశాలలో సోమవారం గర్భిణులకు నెలవారీ నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత్ మాతృవందన్ అభియాన్‌ను నిర్వహించారు. ఇందులో వైద్యాధికారి కమల్ రోహిత్ 67మంది గర్భి ణులకు వైద్యపరీక్షలు నిర్వహించి 21మందికి హైరిస్క్ ఉన్నట్లు గుర్తించి, ప్రత్యేక చికిత్సకోసం సిపార్సు చేశారు. అనంతరం కదిరి రోటరీ క్లబ్ ప్రతినిధి స్రవంతి గర్భిణులకు పౌష్టికాహారం అందించారు.

ఆటోనగర్ నిర్మించాలని కార్మికుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

కదిరిఅర్బన్, మార్చి 11: పట్టణంలో ఆటో నగర్‌ను నిర్మించాలని కోరుతూ ఇంజనీరింగ్ వర్కర్స్ అండ్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ఆందోళన చేపట్టారు. తొలుత వారు ఆర్‌అండ్‌బీ బంగ్లానుంచి కాలేజీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. గత 20 ఏళ్లగా పట్టణంలో ఆటోనగర్ నిర్మించాలని పాలకులకు, అధికారులకు, పలుమార్లు విన్నవించామన్నారు. అయితే ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. పట్టణంలో దాదాపు రెండువందలకు పైగా వర్క్‌షాపులున్నాయన్నారు. 8వందల మందికిపైగా వర్కర్లు పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. కాగా ఇందులో ఏఒక్కరికీ సొంత దుకాణం నిర్వహించుకోవడానికి ఆర్థిక స్థోమతలేదన్నారు. అధికారులు స్పందించి ఆటో నగర్ నిర్మించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ పుల్లారెడ్డికి అందించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఓబుళదేవరచెరువు, మార్చి 11: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 13వ తేదీ బుధవారం మండల సర్వసభ్యసమావేశం జరగనుందని ఎంపీడీఓ వరలక్ష్మీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ఎంపీపీ తుమ్మల ఫర్వీన్ షామీర్ అధ్యక్షత ఈ సమావేశం జరగనుందన్నారు. ఇందులో విద్య, వైద్య, పశు సంక్షేమం, విద్యుత్, స్త్రీశిశుసంక్షేమం, రెవెన్యూతోపాటు అన్నిశాఖలపై సమీక్ష ఉంటుందన్నారు. కావున జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లతోపాటు అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

ధర్మవరం, మార్చి 11: పట్టణంలోని రాజేంద్రనగర్‌లో గల నిరాశ్రయుల కేంద్రంలో క్రాంతి సొసైటీ, మెప్మా సహకారంతో ఉచిత వైద్యశిబిరాన్ని సోమ వారం నిర్వహించారు. ఈ కేంద్రంలో 30 మందికి డాక్టర్ సాయిచంద్రిక వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వేసవి కాలంలో ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. తర్వాత నిరశ్రాయుల కేంద్రంలో వాటర్ డిస్పెన్సరీ(చల్లని, వెచ్చని నీరు) మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ, క్రాంతి సొసైటీ కో ఆర్డినేటర్ రామిరెడ్డి, మెప్మాసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం



మెగా చెక్కును విడుదలజేస్తున్న డీఆర్డీఏ పీడీ నరసయ్య

పుట్టపర్తి, మార్చి 11 : మహిళలను లక్షాధికారులుగా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని డీఆర్డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం లక్పతి దీదీ కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మహిళలతో మాట్లాడారు. జిల్లాలోని మడకశిరకు చెందిన అనూరాధ అనే మహిళతో మాట్లాడినట్లు డీఆర్డీఏ పీడీ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని పీడీ కార్యాలయంలో నిర్వహించిన వీసీ ద్వారా మహిళతో ప్రధాని మాట్లాడారన్నారు. మహిళల స్వయం సమృద్ధిలో భాగంగా ప్రతి మహిళను లక్షాధికారి చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేస్తోందన్నారు. అనంతరం 20మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేసి 1341 సంఘాలకు సంబంధించి రూ.109.91కోట్ల మెగా చెక్కులు విడుదల చేశారు. కార్యక్రమంలో డీపీఎంలు రామ్మోహన్, రామిరెడ్డి, రమణప్ప, అడ్మిన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమాఖ్య మాజీ అధ్యక్షురాలికి ప్రశంసాపత్రం

ఓబుళదేవరచెరువు: కేంద్రం ప్రవేశపెట్టిన లక్పతీ దీదీ పథకంలో అత్యధికంగా రుణాలు రికవరీ చేయడంలో ముందున్న జిల్లా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు పుట్టా ఈశ్వరమ్మకు ఉత్తమ ప్రశంసాపత్రాన్ని డీఆర్డీఏ పీడీ నరసయ్య అందించారు. మండలంలో లక్పతీదీదీ పథకంలో రుణాల రికవరీతోపాటు రూ.లక్షలాది లావాదేవీలు జరిపినందుకు గుర్తించి, మండల సమాఖ్య తరఫు నుంచి ఆమెకు జిల్లా కేంద్రంలో జరిగిన అంతర్జాతీయ మహిళ దినోత్సవంలో ప్రశంసాప్రతాన్ని అందించారు.

బాధిత కుటుంబాలకు నిమ్మల ఆర్థికసాయం

బుక్కపట్నం, మార్చి 11: మండలంలోని మారాల గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకుల కుటుంబాలకు సోమవారం మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప ఆర్థికసాయం చేశారు. ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకులు నాగముని కుటుంబానికి రూ.20వేలు, నడిపి నరసింహులు కుటుంబానికి రూ.పదివేలు, అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న నాగరాజుకు రూ.ఐదువేల చొప్పున ఆర్థికసాయం అందించారు. నాయకులు సంజీవుడు, రవి, నాగరాజు, పుట్ల మోహన్, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కదిరిఅర్బన్, మార్చి 11: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఇండియా మెడికల్ అసోసియేషన్ కదిరి శాఖ అధ్యక్షుడు డాక్టర్ మదన్‌కుమార్ పేర్కొన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో కదిరి తాలూకా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్లకు స్పోర్ట్స్‌మీట్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో సోమవారం నిర్వహించారు. ఇందులో షటిల్, క్రికెట్ క్రీడా పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ డాక్టర్లు శంకరయ్య, నాగరాజు, రమణయ్య, మధుసూదన్, శ్రీనివాసులు, ప్రసాద్ విచ్చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం గెలుపొందిన టీమ్‌లకు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మదన్‌కుమార్ మెమెంటోలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రీడలను ఆడాలని, అప్పుడే మనసిక ఉల్లాసం, ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. తర్వాత కార్యక్రమాన్ని నిర్వహణకు కృషి చేసిన ఆర్గనైజింగ్ సెక్రెటరీ భాస్కర్‌నాయక్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ హుస్సేన్, డాక్టర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

కదిరిఅర్బన్, మార్చి 11: మండలంలోని ఓగ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. ఈ మేరకు కుటుంబసభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం ఇంటినుంచి బయటకు వెళ్లి అనంతరం తిరిగి రాలేదని, స్నేహితులు, బంధువులు వద్ద విచారించినా ఆచూకీ తెలియలేదని, దీంతో కుటుంబసభ్యులు తమకు ఫిర్యాదు చేశారని, ఆ మేరకు కేసు నమోదు చేశామని రూరల్ సీఐ మోహన్ తెలిపారు

రైలు కింద పడి వృద్ధుడి మృతి

నల్లచెరువు, మార్చి 11: మండలంలోని ఎర్రబల్లి సమీపంలో రైలు కిందపడి వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ రహీమ్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కదిరి పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన రహిమాన్ కుమారుడు హైదర్‌వలి(62) మృతి చెందినట్లు చెప్పారు. ఇతను మతి స్థిమితం లేక రైలు కిందపడి ఉంటాడని బంధువులు చెప్పినట్లు తెలిపారు. గతంలో ఈయన తమపాకుల అమ్ముకుని జీవనం సాగించేవాడన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుప్రతికి తరలించామన్నారు.

అగ్నిప్రమాదంలో డ్రిప్పు పరికరాల దగ్ధం



దగ్ధమైన డ్రిప్పు, స్ప్రింక్లర్ల పైపులు

ఓబుళదేవరచెరువు, మార్చి 11: మండలంలోని ఇనగలూరు గ్రామానికి చెందిన టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, టీడీపీ బూత్ కన్వీనర్ షబ్బీర్ నాయుడు పొలంలో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. ఇందులో రూ. మూడు లక్షల మేర నష్టం వాటిల్లింది. బాధితుడు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి తన పొలంలో నిప్పు పెట్టడంతో ఒకటిన్నర ఎకరాలో ఉన్న డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలతో పాటు స్టార్టర్ పెట్టె, కేబుల్, మిరప పంట పూర్తిగా కాలిపోయాయన్నారు. దీంతో రూ.మూడులక్షల నష్టం జరిగిందన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నిజాం, నాయకులు సూరినాయుడు, రామానాయుడు సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి బాధితున్ని పరామర్శించారు. ఒకటిన్నర ఎకరాకు సరిపడే డ్రిప్ పైపులు సొంత ఖర్చులతో ఇప్పిస్తానని సామకోటి ఆదినారాయణ హామీ ఇచ్చారు.

పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కదిరిఅర్బన్, మార్చి 11: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో పట్టణంలో సోమవారం పోలీసులు కవాతు నిర్వహించారు. డీఎస్పీ శ్రీలత, పట్టణ, రూరల్ సీఐలు, ఎస్ఐలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్అండ్ బీ బంగ్లా నుంచి కాలేజీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా డీఎస్పీ కోరారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

తాజ్‌బాబా ఆధ్వర్యంలో భోజన వసతి

పెనుకొండ, మార్చి 11: ముస్లింలకు పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి యేడాదిలాగే ఉపవాస దీక్షలు చేస్తున్నవారికి రెండు పూటలా ఉదయం, సాయంత్రం సెహరీ, ఇఫ్తార్ భోజన సదుపాయాన్ని పెనుకొండ బాబయ్య దర్గా ప్రాంగణం లో ఏర్పాటు చేస్తున్నట్లు దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా తెలిపారు. ఉపవాసాలు ఉండేవారికి 30రోజుల పాటు భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. ఉపవాస దీక్ష చేపట్టే వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

16న మెగా లోక్ అదాలత్

జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి అశోక్‌కుమార్

మడకశిరటౌన్, మార్చి 11: స్థానిక కోర్టు ఆవరణంలో జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఈనెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి ఆర్ అశోక్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవడం వల్ల డబ్బు, సమయం ఆదా అవుతుందని, రాజీ అయ్యే కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈనెల 16వతేదీ జరిగే జాతీయ మెగాలోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి: ఏపీఓ

మడకశిర రూరల్, మార్చి 11: జాతీయ ఉపాధి హామి ద్వారా చేపట్టిన పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు ఎకరాల లోపు భూములు ఉండి, జాబ్‌కార్డు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 రకాల పండ్ల మొక్కలను రైతులకు ఉచితంగా ఇస్తామని, రైతులు కోరిన మొక్కలను సరఫరా చేస్తామన్నారు. నాటిన మొక్కలకు మూడు సంవత్సరాలు పాటు సంరక్షణ, నీటి సరఫరాకు సంబంధించి ఆ రైతుకు రూ.3 లక్షలు ఇస్తామన్నారు. ఆసక్తిగల రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ తెలిపారు.

గాయపడిన టీడీపీ కార్యకర్తకు సునీల్‌కుమార్ పరామర్శ

మడకశిరటౌన్, మార్చి 11: అమరాపురం మండలం హేమావతి గ్రామంలో ఆదివారం జరిగిన హెంజేరు సిద్దేశ్వరస్వామి అగ్నిగుండ మహోత్సవంలో కాలుజారి పడి ప్రమాదానికి గురైన తెలుగుదేశం పార్టీ కార్యకర్త యంజారప్పను టీడీపీ నియోజకవర్గం అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ పరామర్శించారు. మడకశిర ప్రభుత్వ ఆస్పత్రిలో పొందుతున్న కార్యకర్తను ఆయన సోమవారం పరామర్శించారు. డాక్టర్లను అడిగి యోగక్షేమాలు విచారించారు. ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో గాయాలైనట్లు యంజారప్ప తెలిపారు.

మాజీ వైస్ ఎంపీపీపై అట్రాసిటీ కేసు : సీఐ

గోరంట్ల, మార్చి 11: మండలంలోని చలమయ్యగారి పల్లికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ రామచంద్రారెడ్డిపై చీటింగ్ కేసుతోపాటు ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బ రాయుడు తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు... జీనవాండ్లపల్లి సమీపంలోని సర్వే నెంబర్ 109/1-3లోని 4.45 ఎకరాలను కాంగారెడ్డిపల్లికి చెందిన పూజారి నరసింహులు, పూజారి వెంకటేష్, పూజారి శ్రీనివాసులు నుంచి కరావులపల్లి తండాకు చెందిన భద్రేనాయక్ భార్య సరోజబాయికి 2018లో విక్రయించారు. భూ విక్రయం విషయంలో చలమయ్య గారి పల్లి రామచంద్రారెడ్డి మధ్యవర్తిగా వ్యవహరించి రూ.12.60లక్షలకు బేరం కుదిర్చారు. కాగా గత నెలలో ఇదే భూమిని కర్ణాటకలోని ఎల్లోడుకు చెందిన బీవీ సింధుకు విక్రయించినట్లు తెలిసింది. సరోజబాయి తహసీల్దార్ కార్యాలయంలో వన్‌బీకోసం ప్రయత్నించగా, అక్రమ భూ విక్రయం గురించి బయటపడింది. దీంతో భద్రేనాయక్, అతడి భార్య సరోజాబాయి, కుమారుడు పవన్ మధ్యవర్తిగా వ్యవహరించిన రామచంద్రారెడ్డి వద్దకు వెళ్లి నిలదీశారు. భద్రనాయక్ సోషియల్ వెల్ఫేర్ డిపార్టమెంటులో ఉద్యోగిగా పనిచేస్తూ రిటైర్ అయిన సమయంలో వచ్చిన డబ్బుతో భూమిని కొనుగోలు చేశామని, ఎందుకలా చేశావని ప్రశ్నించారు. తమ డబ్బు తమకు ఇవ్వాలని, నిలదీశారు. దీంతో రామచంద్రారెడ్డి తమను కూలం పేరుతో దూషించి, చంపుతాని బెదిరించినట్లు సరోజాబాయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఇదే భూమిని 2013లో పంజాబ్‌కు చెందిన ఓలివర్ కంపెనీకి విక్రయించినట్లు పోలీసులు తెలిపారు. రామచంద్రారెడ్డితోపాటు పూజారి నరసింహులు, పూజారి వెంకటేష్, పూజారి శ్రీనివాసులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

అగళి, మార్చి 11 : మండలంలోని మధూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలోని 90మంది విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ గాయత్రి తెలిపారు. ఎండలు అధికమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఈ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. 90మందిలో 18మందికి యూరిన్ శ్యాంపిల్స్ తీసుకొని పరీ క్షలకు పంపారు. పాఠశాలలోని విద్యార్థులు అతిజాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతి పాఠశాలలో ఈ వైద్య పరీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ స్రవంతి, ఏఎన్‌ఎం మమత, ఆశా, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

పెనుకొండ రూరల్, మార్చి 11 : నగర పంచాయతీలోని కోనాపురానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త వడ్డి వెంకటేశ్ తండ్రి వడ్డి అంజనప్ప(85) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు, సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ నారాయణస్వామి, రామక్రిష్ణారెడ్డి, గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రొద్దం : మండలంలోని కందుకూర్లపల్లిలో టీడీపీ సీనియర్ కార్యకర్త హనుమంతరాయుడు భార్య నాగమ్మ (60)అనే అనారోగ్యంతో సోమవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు గ్రామానికి వెళ్లి ఆమె భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుం బ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి అల్లుడు శశిభూషణ్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, టీడీపీ నాయకులు చిన్నప్పయ్య, నరసిం హులు, అశ్వత్థనారాయణ, మురళి, చంద్రశేఖర్, మనుమప్ప తదితరులు పాల్గొన్నారు.

కష్టకాలంలో పార్టీకి అండగా ఉందాం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి



సమావేశంలో మాట్లాడుతున్న బీకే పార్థసారథి

పెనుకొండ, మార్చి 11 : వైసీపీ రాక్షస పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, పార్టీ కార్యకర్తలతో పాటు ప్రజలు కష్టాల్లో కూరుకుపోయారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. ఇలాంటి కష్టకాలంలో మనమందరం పార్టీకి అండగా ఉండి రాబోయే ఎన్నికల్లో టీడీపీని అధికారం లోకి తీసుకొచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టణంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని బీకే అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ ఆదేశాల మేరకు మనమంతా కలిసి పనిచేయాలన్నారు. తన రాజకీయ భవిష్యత్తుపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, యువనేత లోకేశ్ భరోసా ఇచ్చారన్నారు. హిందూపురం పార్లమెంట్ టికెట్ తనకు కేటాయించాలని అదిష్టానాన్ని కోరామన్నారు. వీటిపై రెండు మూడు రోజుల్లో శుభవార్త వింటార న్నారు. ఎంపీ జాబితా విడుదలైన తరువాత పెద్దఎత్తున మరోసమావేశం నిర్వహి ద్దామన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు డాక్టర్ నరసింహారావు మాట్లాడు తూ... పార్థసారథి 40ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నాయకుడని, ఆయన సేవలు పార్టీకి ఎంతో అవసరమన్నారు. ఆయనకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని అధిష్టానానికి తెలియజేస్తామన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు జీవీపీ నాయుడు, మునిమడుగు వెంకటరాముడు, కేశవయ్య, రొద్దం నరసింహులు, సుబ్బరత్నమ్మ, చిన్నప్పయ్య, దేవా నరసింహప్ప, గిరిధర్‌గౌడ్, సోమశేఖర్, పరిగి లక్ష్మిరెడ్డి, కురుబ కృష్ణమూర్తి, నరహరి, సిద్దయ్య, అశ్వత్థనారాయణతో పాటు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన వేలాది మంది నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

జగన్‌ను గద్దె దింపడమే కూటమి లక్ష్యం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్



చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

మడకశిరటౌన్, మార్చి 11: టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి జగన్‌ను గద్దె దింపడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయని, అందరి లక్ష్యం ఒక్కటేనని టీడీపీ నియోజకవర్గం అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. ఆయన సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలయిక చారిత్రాత్మక అవసరం అన్నారు. అప్పుల ఆంధ్రగా మార్చి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలపై దాడులను సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రోత్సహించారని ఆరోపించారు. బీసీలను అన్ని రంగాల్లో అణగదొక్కారన్నారు. తెలుగు ప్రజల కోసం నవ్యాంధ్ర అభివృద్ధి కోసం టీడీపీ జనసేన, బీజేపీతో కలిసి వెళ్లనున్నట్లు తెలిపారు.

బీసీ డిక్లరేషన్‌పై హర్షం : తెలుగుదేశం పార్టీ బీసీ డిక్లరేషన్ ప్రకటించడం పట్ల మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న, రాష్ట్ర వక్కలిగ కన్వీనర్ వీఎం పాండురంగప్ప తదితరులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ స్థానిక కార్యాలయం ఆవరణంలో సోమవారం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది ఒక్క తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అన్నారు. తెలుగుదేశం పార్టీ బీసీల పార్టీ అని ఆనాడే ముద్రవేశారన్నారు. బీసీల అభ్యున్నతి కోసం టీడీపీ హయాంలో చంద్రబాబు అనేక అభి వృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా కార్యదర్శి రవిభూషణ్, మాజీ ఎంపీ పీలు ఆదినారాయణ, అశ్వత్థామప్ప, నాయకులు రామాంజనేయులు, రామన్న, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

అగళి: త్వరలో జరుగబోయే ఎన్నికల్లో టీడీపీని ఆదరించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబును చేద్దామని మాజీ ఎమ్మెల్యే మద్దన కుంట ఈరన్న పేర్కొన్నారు. మండలంలోని డొక్కలపల్లిలో ఆదివారం రాత్రి పార్టీ మండల కన్వీనర్ కుమార స్వామి, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్‌తోపాటు నాయకులు, కార్యకర్తలతో ఆయన చర్చించారు. పార్టీలో ఉన్న చిన్నచిన్న భేదాభిప్రాయాలు విడిచిపెట్టి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీఎం పాండురంగప్ప, రవి భూషణ్, ఉగ్రనరసింహ, రాజన్న మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతారాముల మండల పూజ

పాల్గొన్న పరిపూర్ణానందస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న స్వామీజీ

హిందూపురం అర్బన్, మార్చి 11: ఈ ప్రాంతంలో కాలు పెడితే అయోధ్యలో కాలు పెట్టిన అనుభూతి కలుగుతుందని కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణా నంద స్వామి పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని సూరప్పకట్ట కింద వాల్మీకి వీధిలో వెలసిన శ్రీరామ దేవాలయంలో సీతారాముల విగ్రహాలు ప్రతిష్ఠించి 48 రోజులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం మండల పూజ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పరిపూర్ణానందస్వామి మాట్లాడుతూ... అయోధ్యలో బాలరాముడిని ప్రతిష్ఠించిన ముహూర్తానికే ఇక్కడ కూడా సీతారామ లక్ష్మణ ఆంజనేయ, వాల్మీకి విగ్రహాలు ప్రతిషించడం విశేషమన్నారు. ఈ ఆలయంలో రాముడికి వాల్మీకి రాముడిగా నామకరణం చేశారు. హిందూపురంలో త్వరలో లక్ష మందితో యజ్ఞం చేస్తానని, వాల్మీకులకు అగ్రతాంబూలం ఇస్తానన్నారు. అంతకు మునుపు ఆలయంలో జరిగిన పూజల్లో స్వామి పాల్గొన్నారు. అనంతరం దాతలను ఆశీర్వదించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విగ్రహ దాతలు వైఎస్‌బీ భాస్కర్, చంద్ర, గణేష్, అనీల్, నటరాజ్, మంజు, శేఖర్, జగదీష్, గంగాధర్, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలు వెల్లడించాలి

ఎస్‌బీఐ ఎదుట సీపీఎం, రైతు సంఘం నాయకుల ఆందోళన

పెనుకొండ, మార్చి 11: స్థానిక స్టేట్‌బ్యాంక్‌లో ఖాతాదారులకు సంబంధించి ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు సీపీఎం నాయకులు, కార్యకర్తలు సోమవారం పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు పెద్దన్న మాట్లాడుతూ... దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అమలు చేయకపోవడం దు ర్మార్గమన్నారు. ఎస్‌బీఐలో దాదాపు 44కోట్లమంది ఖాతాదారులు ఉన్నారన్నారు. ఎల క్టోరల్ బాండ్ల వివరాలను బహిర్గతం చేయకపోవడం ఎవరిని మోసం చేయడానికని ప్రశ్నించారు. ఇది దేశాభివృద్ధికి ఆటంకమన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బ్యాంక్ మేనేజర్ కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంగాధర్, వెంకటరాముడు, తిప్పన్న, భూతప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు నారాయణ, చేనేత కార్మిక సంఘం నాయకులు చీల నారాయణస్వామి, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు కిష్టప్ప, చేనేత కార్మిక సంఘం నాయకులు కుమ్మరి కిష్టప్ప, వ్యవసాయ కార్మిక సంఘం బెస్తం కిష్టప్ప, నరసింహమూర్తి, అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

మునిమడుగు నుంచి ఎన్నికల ప్రచారం

నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారావు



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు నరసింహారావు


పెనుకొండ టౌన్, మార్చి 11 : ఎన్నికల సమయం తక్కువగా ఉన్నా నాయకులను, కార్యకర్తలను కలుపుకుని వెళ్తున్న పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ఆధ్వర్యంలో బుధవారం నుంచి పెనుకొండ మండలం మునిమడుగు నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారావు తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థితో కలిసి ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఈ ప్రచారం విషయం జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి దృష్టికి తీసుకెళ్లామని ఆయన సమ్మతి తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, గుట్టూరు సూరి, మాధవనాయుడు, మావటూరు గోపాల్, త్రివేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిగి మండలం గొర్రిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన పది కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత కండువా వేసి స్వాగతం పలికారు.

కాంగ్రెస్ పార్టీ సమావేశాలు

మడకశిర, మార్చి 11: గుడిబండ, అమరాపురం మండలకేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశాలను సోమవారం నిర్వహించారు. ఈ సమావేశాలు పార్టీ ఆయా మండలాల అధ్యక్షులు నాగరాజు, గురుమూర్తి ఆధ్వర్యంలో జరిగాయి. ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, పార్టీ నియోజకవర్గ అభ్యర్థి కే సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ప్రచారం నిమిత్తం పార్టీ తరపున సీడబ్ల్యూసీ సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి ప్రతి గ్రామంలో పర్యటిస్తారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, నాగభూషణం, రంగనాథప్ప, జయ రామిరెడ్డి, రుద్రముని, గురుమూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మా కాలం గడిచినా విద్యుత్ స్తంభాలు వేయరా?

అధికారుల తీరుపై వైస్ చైర్మన్ మండిపాటు



అధికారుల తీరుపై మండిపడుతున్న వైస్ చైర్మన్ బలరాంరెడ్డి

హిందూపురం, మార్చి 11 : పాలకవర్గం ఏర్పడి ఇప్పటికి రెండేళ్లు అయిందని, ప్రతి సమావేశంలో కోరుతున్నా తన వార్డులో ఇప్పటివరకు ఒక విద్యుత్ స్తంభం కూడా ఏర్పాటు చేయలేదని మునిసిపల్ వైస్ చైర్మన్ బలరాంరెడ్డి మండిపడ్డారు. మా ఐదేళ్ల పాలనా కాలం పూర్తయినా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసుకోలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నామని అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాల యంలో సోమవారం మునిసిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన కౌన్సిల్ సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ... 14వ వార్డులో ఒక విద్యుత్ స్తంభం అవసరమని రెండేళ్లుగా కోరుతున్నా ఇంతవరకు పరిష్కరించలేదన్నారు. ప్రతి వార్డుకు పది విద్యుత్ స్తంభాలు ఇస్తామని చెప్పారు. అవి ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు. ఇలా అయితే ఎన్నికల్లో మేం ఓటు అడగడానికి ఎలా వెళ్లాలన్నారు. నీటి సమస్య తీవ్రంగా ఉందని, పలుసార్లు చెప్పినా ప్రయోజనం లేదన్నారు. కౌన్సిల్‌లో సభ్యులు చెప్పిన సమస్యలను చైర్‌పర్సన్ నోట్‌చేసుకుని దానిని ఫాలో చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పట్టణంలో చెత్త, ఎక్కడ బడితే అక్కడ వదిలేశారని, పారిశుధ్య విభాగం పూర్తిగా చేతులెత్తేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కౌన్సిలర్ రమేష్ మాట్లాడుతూ పరిగి బస్టాండులో 18 షెడ్లకు టెండర్లు పిలిచామన్నారు కానీ, ఎక్కడ పిలిచారని ప్రశ్నించారు. పత్రికా ప్రకటన ఇచ్చారా అన్నారు. ఇందులో చాలా మంది కౌన్సిలర్లపై ఆరోపణలు వచ్చాయని దీనివల్ల ఆ టెండర్లు రద్దు చేయాలని టీడీపీ కౌన్సిలర్లు డీసెంట్ నోటీసులు ఇచ్చినా చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై కోర్టులో కేసు నడుస్తోందని అప్పటి వరకు ఎవరినీ పంపకూడదన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ అంశంపై షెడ్ల యజమానులు కోర్టుకు వెళ్లారని కోర్టు నిర్ణయం మేరకు వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు. టీడీపీ కౌన్సిలర్లు మహాలక్ష్మి, భారతి, మంజుళలు మాట్లాడుతూ... తాగునీటి సమస్య తమ వార్డులో అధికంగా ఉందని ప్రజలు మమ్ములను ప్రశ్నిస్తున్నారని అయినా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. వైసీపీ కౌన్సిలర్ ఆసిఫ్ మాట్లాడుతూ శ్రీనివాస టాకీస్ రోడ్డులో సుమారు రూ.కోటి విలువ చేసే మునిసిపల్ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకున్నారని దానిని మునిసిపాలిటీ స్వాధీనం చేసుకోవాలన్నారు. 7వ వార్డు కౌన్సిలర్ నసిరాబాను మాట్లాడుతూ నల్లప్ప లేఅవుట్‌లో అప్రూవల్ లేకుండానే రెండో అంతస్తు భవనం కట్టారని, మరోచోట మునిసిపల్ స్థలాన్ని ఆక్రమించుకున్నారని దీనిపై పలుమార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదన్నారు. అనంతరం అజెండాలోని అంశాలపై తీర్మానం చేపట్టారు.

ఫోన్‌లో నిమగ్నమైన సభ్యులు

హిందూపురం : పట్టణ, ప్రజాసమస్యల కోసం నెలకోసారి కౌన్సిల్ సమావేశం జరుగుతుంది. ఇక్కడ తీసుకున్న నిర్ణయాలు రెండు లక్షల మందికి ఉపయోగపడేవి. కానీ ఇలాంటి ముఖ్యమైన సమావేశాల్లో సైతం కొంతమంది సభ్యులు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండటం విశేషం. మరికొంతమంది ప్రజా సమస్యలు లేవనెత్తితే అధికారులు సమాధానం చెబుతున్నారు. ఇలాంటి సందర్భంలో కొంత మంది సభ్యులు ఫోన్‌లో మాట్లాడుకుంటూ ఉండటం చూసిన మరికొంతమంది సభ్యులు వీరికి ప్రజాసమస్యలు పట్టవా అని ప్రశ్నిస్తున్నారు.



సమావేశం జరుగుతుండగా ఫోన్‌లో మాట్లాడుతున్న సభ్యులు

వైభవంగా కరిబసవేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం



కరిబసవేశ్వరస్వామి బ్రహ్మరథాన్ని లాగుతున్న భక్తులు

మడకశిర రూరల్, మార్చి 11: మండలపరిధిలోని ఆమిదాలగొంది గ్రామంలో వెలసిన గురు కరిబసవేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి గణపతిపూజ, గోపూజ, గంగపూజ, పలుహోమాలు, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కరిబసవేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

సచివాలయానికి తాళం వేసి నిరసన



సచివాలయానికి తాళం వేసి ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

చిలమత్తూరు, మార్చి 11: తాగునీటి సమస్యపై మండలంలోని టేకులోడు గ్రామస్థులు ఆందోళనకు దిగారు. నెలరోజులుగా ఇబ్బందులు పడుతున్నా.. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం గ్రామ సచివాలయం ముందు ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. మహిళలు ఖాళీ బిందెలతో సచివాలయానికి చేరుకున్నారు. అందులోని ఉద్యోగులను బయటికి పంపించి, కార్యాలయానికి తాళం వేశారు. అక్కడే బైఠాయించారు. వారు మాట్లాడుతూ.. తాము నెల రోజులుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యను ఎన్నిసార్లు విన్నవించుకున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోయారు. సమస్య పరిష్కరించే వరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదంటూ మహిళలు భీష్మించారు. సర్పంచ్ సరోజమ్మ, పంచాయతీ కార్యదర్శి హేమలత సచివాలయం వద్దకు చేరుకుని, మహిళలకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. బోరుబావిలో నీరు అడుగంటిందనీ, దాంతో సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. మరో బోరుబావి నుంచి పైపులైన్ ఏర్పాటుచేసి ఒక రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు శాంతించి, వెళ్లిపోయారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం




కంచిసముద్రంలో సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తున్న టీడీపీ నాయకులు

రొద్దం, మార్చి11 : మండలపరిధిలోని కంచిసముద్రం, కొత్తూరు గ్రామాల్లో టీడీపీ నాయకులు సోమవారం పర్యటించారు. పార్టీ మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు మాధవనాయుడు, చంద్రమౌళి, తిరుపాల్‌నాయుడు, టైలర్ ఆంజనేయులు, హనుమంతరాయుడు, చెన్నకేశవులు, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి : డీఎస్పీ

పెనుకొండ టౌన్, మార్చి 11 : త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని డీఎస్పీ బాజీజాన్‌సైదా పేర్కొన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయం నుంచి సోమవారం బీఎస్‌ఎఫ్ ఫోర్సు సిబ్బందితో పట్టణంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎన్నికల్లో జరగకుండా గట్టి బందోబస్తు చేపడతామని ఆయన వివరించారు. ఈసారి జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



వైఎన్ హొసకోటలో సముదాయ భవనాన్ని ప్రారంభిస్తున్న పావగడ ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ, మార్చి 11: తాలూకా వ్యాప్తంగా రూ.2కోట్ల ఎమ్మెల్యే నిధులతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ భూమిపూజ, ప్రారంభోత్సవ కార్యక్రమాలను సోమవారం చేపట్టారు. దొడ్డేనహళ్లిలో రూ.13లక్షలతో నిర్మించిన నూతన భవనం, వదనకల్లులో రూ.10లక్షలతో నిర్మించిన సముదాయభవనం, వైఎన్ హొసకోట జామియామసీదులో రూ.20లక్షలతో సముదాయ భవనం, మరో రూ.20లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే వెంకటేష్, మాజీ మంత్రి వెంకటరమణప్ప భూమిపూజ చేశారు. తాలూకాలోని అన్ని సామాజిక వర్గాలతోపాటు మైనారిటీలకు ప్రత్యేకంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉందని ఎమ్మెల్యే వెంకటేష్ తెలియజేశారు. వచ్చే ఏప్రిల్ నెలలో మరో రూ.కోటి అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలియజేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

‘అధికారుల దౌర్జన్యం నశించాలి’



ఏసీ శివప్పకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ, మార్చి 11: తాలూకా వ్యాప్తంగా 1978 నుంచి రైతులు సాగు చేస్తున్న భూములకు ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకాలు అందించినప్పటికీ అటవీ అధికారులు అడ్డుచెప్పడం తగదని రైతు సంఘం నాయకులు అన్నారు. ఈ భూములు ఫారెస్టుకు చెందినవని, వెంటనే వదిలి పెట్టాలని రైతులపై చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పావగడలో పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. తాలూకాలోని పళవళ్లి, కామనదుర్గ, హొసహళ్లితండా, నాగలమడక గ్రామాల్లో రైతులు సాగు చేసుకొన్న భూములపై వారికి చట్టబద్ధంగా అన్ని హక్కులు ఉన్నాయన్నారు. అయినా కొందరు రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో మరొకరి పేరిట రిజిస్ట్రేషన్ చేయించడానికి అటవీ అధికారులు ఆ రైతులను హింసించడం ఏమాత్రం సమంజసం కాదని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప ధ్వజమెత్తారు. అలాగే పావగడ ప్రభుత్వాస్పత్రిలో తగినంత మంది వైద్యులు, సరైన వైద్యసౌకర్యాలు లేక ఎందరో అభాగ్యులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఈవిషయంపై ఎమ్మెల్యే స్పందించకపోవడం దారుణమన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏసీ శివప్పకు రైతు సంఘం నాయకుల అందజేశారు.